క్లుప్తంగా

శ్రీవారి సేవలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్



విజయభారతికి శ్రీవారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ ఏఈవో

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి సయాని బుధవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించారు. అర్చకులు, పండితులు ఆమెకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈవో పి.నటరాజారావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు. ఆమె వెంట ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్, తదితరులున్నారు.

3 నుంచి దేవీ శరన్నవరాత్రులు

కొయ్యలగూడెం: దసరా ఉత్సవాలు అక్టోబర్ 3 నుంచి ప్రారంభిస్తున్నట్లు కొయ్యలగూడెం శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ పాలకమండలి కమిటీ బుధవారం పేర్కొంది. శరన్నవరాత్రుల సందర్భంగా 3 నుంచి 12 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా నవరాత్రులూ అమ్మవారిని వివిధ రూపాలతో అలంకరిస్తామని అన్నారు. తొలి రోజు బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణతో ప్రారంభమై చివరి రోజున రాజరాజేశ్వరి అలంకరణలో కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

చింతలపూడి: మండల విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు పెండింగ్ జీతాలు తక్షణం విడుదల చేయాలని ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. బుధవారం భోజన విరామ సమయంలో విద్యాశాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు, సెప్టెంబర్ నెలల జీతాలు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతోపాటు 2023 డిసెంబర్‌లో సమ్మె కాలపు జీతాలను కూడా విడుదల చేయాలని ప్లకార్డులతో నినాదాలు చేశారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన

చింతలపూడి: విద్యార్థినులు గుడ్ టచ్- బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ రవీంద్రనాయక్ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అల్లిపల్లి గ్రామంలోని బాలికల వసతి గృహంలో బుధవారం గుడ్ టచ్- బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళల భద్రతకు పోలీస్‌శాఖ అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. బాలికలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారికి జీవిత ఖైదు వంటి కఠిన శిక్షలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎవరైనా వేధిస్తే అమ్మాయిలు ధైర్యంగా ముందుకు వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

వర్జీనియా రైతులతో ఆర్‌ఎం సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎం

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు రైతులు వచ్చే సీజన్‌లో బోర్డు అనుమతించిన మేరకే పొగాకును పండించాలని రాజమండ్రి రీజనల్ మేనేజర్ జీఎల్‌ఎస్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో ఏఎస్ గ్రేసీ మార్గరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సమావేశంలో ఆర్‌ఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పొగాకులో గ్రేడ్ ఆఖరి అమ్మకాలు ముగిసిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పొగాకు రైతులు, ట్రేడ్ సిబ్బంది, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

కుల నిర్మూలనకు ఉద్యమించాలి

జంగారెడ్డిగూడెం: జ్యోతిభాపూలే స్థాపించిన 'సత్య శోధక్ సమాజ్' స్ఫూర్తితో కుల నిర్మూలనకు ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ పిలుపునిచ్చారు. మార్కెట్ యార్డ్‌లో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు బన్నే వినోద్ అధ్యక్షతన సత్య శోధక్ సమాజ్ 152వ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపు వరకు ఈ నెల 24 నుంచి 30 వరకు దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ సభలు, సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చిందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు బన్నే వినోద్, ఇఫ్టూ నాయకులు ముప్పిడి అబ్బులు, గంపల వెంకటేష్, దుర్గారావు పాల్గొన్నారు.

రహదారికి మోక్షమెప్పుడో..?

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న గిరిపుత్రులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

బుట్టాయగూడెం: మండలంలోని పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. ఇటీవల వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ఈ రహదారిపై ప్రయాణం చేయడానికి వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ఈ రహదారి వెంబడి ఉప్పరిల్ల, ముంజులూరు, చింతపల్లి, గోగుమిల్లితోపాటు ఒర్రింక, గడ్డపల్లి, గిన్నేపల్లి, చిలకలూరు, దారావాడ, తదితర అటవీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల గిరిపుత్రులు ఈ రహదారితో నానా అవస్థలు పడుతున్నారు. గతంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లి వరకూ తారు రోడ్డు వేశారు. తదుపరి ఈ రహదారి కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. వర్షాలకు రహదారి దెబ్బతినడంతో అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలన్నా అనేక ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.4.30 కోట్లు మంజూరు

పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లి వరకూ రోడ్డు పనులు చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు రూ.4.30 కోట్ల నిధులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో మంజూరు చేసింది. ఈ పనులు ప్రారంభించేందుకు ఎన్నికల ముందు అప్పటి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా శంకుస్థాపన కూడా చెశారు. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ పనులు నిలిచిపోయాయి.

ఛిద్రమైన రోడ్లపై గిరిజనుల అవస్థలు

గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పులిరామన్నగూడెం, గోగుమిల్లి రోడ్డు అధ్వానంగా తయారైంది. పై గ్రామాల నుంచి కొండరెడ్డి గిరిజనులు ప్రతీ బుధవారం కన్నాపురం వారాంతపు సంతకు, ఐటీడీఏలో నిర్వహించే గిరిజన దర్బార్‌కు వచ్చి తమ సమస్యలను విన్నవించుకుంటారు. సుమారు 12 కిలో మీటర్ల పరిధిలో రోడ్డు ఛిద్రమవ్వడంతో గిరిజనుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ప్రభుత్వం, అధికారులు తమ రోడ్డు పనులు చేపట్టాలని కొండరెడ్డి గిరిజనులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న ముంజులూరు-గోగుమిల్లి రహదారి

ప్రయాణం చేయలేకపోతున్నాం



ఇటీవల వర్షాలకు పులిరామన్నగూడెం, గోగుమిల్లి రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. పెద్దపెద్ద గోతులు పడి రహదారి ధ్వంసమైంది. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనంపై కూడా ప్రయాణం చేయలేకపోతున్నాం. అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలి.

కెచ్చెల ముక్కారెడ్డి, సర్పంచ్, ముంజులూరు, బుట్టాయగూడెం మండలం

అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు



ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తున్నాయి. మా గ్రామంలో కొండరెడ్డి గిరిజనులకు అనారోగ్యం చేస్తే అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదు. పులిరామన్నగూడెం, గోగుమిల్లి రోడ్డు పాడైపోవడం వల్ల అనారోగ్యం బారిన పడిన వారిని ద్విచక్ర వాహనంపై కూడా తీసుకెళ్లే పరిస్థితి లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించే విధంగా కృషి చేయాలి.

నడపల ముక్కారెడ్డి, చింతపల్లి, బుట్టాయగూడెం మండలం

హుండీ లెక్కింపు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లిలో కొలువైన జగదాంబ అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గోకుల పారిజాత గిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో 14 నెలల 10 రోజుల కాల వ్యవధిలో వేసిన సొమ్మును లెక్కించారు. సుమారు రూ.3,86,663 ఆదాయం వచ్చినట్లు కార్య నిర్వహణ అధికారి ఎమ్ఎస్ఎస్ఎస్ శర్మ తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వరస్వామి దేవస్థానం పర్యవేక్షణ అధికారి ఎన్.రాంబాబు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌ను మార్చాలి

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏలో గిరిజన సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమస్యల పరిష్కార వేదికను ప్రతీ బుధవారం నిర్వహించే విధంగా అధికారులు కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్ కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజన గ్రామాలు ఉన్నాయన్నారు. అయితే గిరిజనులు బుధవారం కన్నాపురంలోని వారాంతపు సంతకు వచ్చి అక్కడ నిత్యవసర వస్తువులు కొనుగోలు చేసి, ఇతర అవసరాలను పూర్తి చేసుకుంటారన్నారు. అలాగే ఏవైనా సమస్యలు ఉంటే దగ్గరలో ఉన్న ఐటీడీఏకు వెళ్లి అధికారులకు తమ సమస్యలను చెప్పుకుంటారన్నారు. అయితే సోమవారం గిరిజన సమస్యల పరిష్కారం కోసం సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తే గిరిజనులు ఇబ్బంది పడే అవకాశం ఉన్నందున దానిని మార్పు చేసి బుధవారమే నిర్వహించే విధంగా అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు.

అయ్యప్ప క్షేత్రంలో దీక్షా భక్తులకు ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం రూరల్: అయ్యప్ప మండల దీక్షలు ఆచరించే భక్తుల కోసం జంగారెడ్డిగూడెం గురవాయిగూడెం శ్రీ అయ్యప్ప క్షేత్రంలో ఏర్పాట్లు చేసినట్లు అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. బుధవారం అయ్యప్ప క్షేత్రంలో సభ్యులు మాట్లాడుతూ దసరా నుంచి స్వామి వారి క్షేత్రంలో అయ్యప్ప, భవానీ, శివ మాలలు వేసుకున్న స్వాములకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఆలయ అర్చకులు జొన్నగడ్డ తేజశర్మ మాట్లాడుతూ కేరళలోని అయ్యప్ప క్షేత్రంలో నిర్వహించే విధంగా తాంత్రిక పద్ధతిలో గురవాయిగూడెం అయ్యప్పకు పూజలు నిర్వహిస్తున్నామన్నారు.

పొంగిన ఎర్ర కాలువ



కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాలువ

కొయ్యలగూడెం: ఎర్ర కాలువ ఉప్పొంగడంతో కొయ్యలగూడెం- జంగారెడ్డిగూడెం మధ్య మంగపతీదేవిపాలెం సమీపం నుంచి పంగిడిగూడెం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం ఏజెన్సీలోని ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు బైనేరు, జల్లేరు, ప్రధాన కాలువలతో పాటు కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలాల్లోని కాలువలు ఉప్పొంగి ఎర్రకాలువలో విలీనం అయ్యాయి. దీంతో ఒక్కసారిగా ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహిస్తూ సమీపంలోని కాజ్‌వేపై నుంచి ప్రవహించింది. పులి వాగు, కన్నాపురం సమీపంలోని తూర్పు, పడమటి కాలువలలో వరద ఉధృతి కొనసాగింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మరో 48 గంటల పాటు వర్షాలు కొనసాగనున్నాయని ఈ నేపథ్యంలో కాలువల వద్ద రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కె.చెల్లన్న దొర పేర్కొన్నారు.

ఎంపీడీవో వాణి బాధ్యతల స్వీకరణ

లింగపాలెం: ఎంపీడీవోగా కందుల వాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఆకివీడు ఎంపీడీవోగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఇప్పటి వరకు ఈవో పీఆర్డీ రత్నకుమార్ పని చేస్తున్నారు.

పీసా గ్రామ సభలు పునరుద్ధరించాలి

బుట్టాయగూడెం: పీసా గ్రామ సభలు పునరుద్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం ఆ సంఘ సమావేశం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు.

వరద బాధితులకు సాయం

లింగపాలెం: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి ప్రైవేట్ స్కూల్ యాజమాన్య సహాయం అందించింది. సహాయం చెక్కు రూ.1.05 లక్షలు చింతలపూడి జోన్‌లోని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గరిమెళ్ల చలపతి, నాయకులు సీహెచ్ రామ్మోహన్‌రావు, జి.వెంకటేశ్వరరావు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం జిల్లా ప్రెసిడెంట్ శివకుమార్, స్టేట్ జాయింట్ సెక్రటరీ చలసాని రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

లింగపాలెం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు లింగపాలెం గ్రామ శివారులో దాడి చేసి, ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అథ్లెటిక్స్‌లో కొత్తపల్లి విద్యార్థికి ప్రథమ స్థానం

లింగపాలెం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఛాంపియన్ షిప్ పోటీలు ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో మంగళవారం నిర్వహించారని కొత్తపల్లి హైస్కూల్ పీడీ ఎ.కామేశ్వరరావు విలేకరులకు తెలిపారు. ఈ పోటీల్లో లింగపాలెం మండలం కొత్తపల్లి హైస్కూల్‌కు చెందిన బి.సమీర 50 మీటర్ల స్ప్రింట్‌లో జిల్లా ప్రథమ స్థానం సాధించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని, పీడీని పలువురు అభినందించారు.

28న పాపప్రక్షాళన పూజలు

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపు



మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు ఈ నెల 28న దేవాలయాల్లో నిర్వహించే పూజల్లో పాల్గొనాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పోలవరం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూజల్లో పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో నాయకులు, కార్యకర్తలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలని కోరారు. కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి తిరుమల లడ్డూ పవిత్రతను సీఎం చంద్రబాబునాయుడు అపవిత్రం చేశారని బాలరాజు విమర్శించారు. గత కొద్దిరోజులుగా తిరుమలతోపాటు రాష్ట్ర ప్రతిష్ఠతను చంద్రబాబు మంటగలిపే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి చర్యలతో రాజకీయ లబ్ధి పొందాలనుకుంటే శ్రీవారు క్షమించరన్నారు. రాజకీయ దుర్బుద్ధితోనే సీఎం చంద్రబాబు అబద్ధాలు ఆడుతున్నారన్నారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై వైఎస్సార్‌సీపీ సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేస్తుంటే చంద్రబాబు సిట్ వేయడం తనకు అనుకూలంగా మార్చుకోవడానికేనని ఆరోపించారు. చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలను ప్రజలు గమనిస్తున్నారని బాలరాజు అన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కామవరపుకోట: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గస్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వి.సాగర్ కుమార్, సీహెచ్ నాగరాజేష్, జి.నిస్సి, జి.సలోని, ఇందు, కె.దివ్యతేజ, బి.జానీ, ఇ.అమృత రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు అక్టోబర్ 4 నుంచి 6 వరకు రాజమహేంద్రవరంలో ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

కొయ్యలగూడెం: జిల్లా స్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు బయ్యనగూడెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.రవి కుమార్ బుధవారం పేర్కొన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు సుంకర సంజన, కొండ యశ్వంత్, వి.ఆనంద్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో ఇటీవల పాల్గొన్నారన్నారు. ఈ నేపథ్యంలో జీలుగుమిల్లిలో నిర్వహించిన సెలక్షన్స్ పోటీలలో ముగ్గురు విద్యార్థులను నిర్వాహకులు ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పీఈటీ ఎం.దుర్గారావు విద్యార్థులను అభినందించారు.

ఉపాధి హామీ పనులు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి వసంతరావు

కొయ్యలగూడెం: ఉపాధి హామీ పనులను మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించాలని, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు పేర్కొన్నారు. కన్నాపురం రోడ్డులోని సీపీఐ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల సమితి సమావేశం బుధవారం నిర్వహించారు. చింతలపూడి దుర్గారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వసంతరావు మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పనులు ప్రతి గ్రామంలో ప్రారంభించాలని, ప్రతి ఒక్కరికీ రెండు వందల రోజుల పని దినాలు కల్పించాలని, రోజువారీ కూలీ రూ.600 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో యర్రంపేట గ్రామంలో 245, 256, 247, సర్వే నెంబర్లలో 50 మందికి గతంలో నమూనా పట్టాలు ఇచ్చారని, ఆ భూమిని అర్హత కలిగిన పట్టాదారులకు ఇవ్వడంలో రెవెన్యూ అధికారులు విఫలం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో దుగ్గిరాల నారాయణరావు, గుదే శ్రీను, కానూరి ఆదినారాయణ పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో గణనాథుడి ఊరేగింపు

ద్వారకాతిరుమల: గజముఖ పుష్ప వాహనంపై కొలువైన గణనాథుడు బుధవారం క్షేత్ర పుర వీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. స్థానిక బైపాస్ రోడ్డులో శ్రీ విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని గణేష్ ఊరేగింపు, నిమజ్జన వేడుకలను కమిటీ సభ్యులు అట్టహాసంగా నిర్వహించారు. గణనాథుడి పూజాదికాల అనంతరం ఊరేగింపును ప్రారంభించారు. శక్తి వేషధారణలు, తీన్మార్ డప్పు వాయిద్యాలు, డీజే సందళ్లు, యువత డాన్సులు, చిత్రవిచిత్ర వేషధారణల నడుమ ఈ ఊరేగింపు కన్నుల పండువగా నిర్వహించారు. రాత్రి పంగిడిగూడెంలోని పోలవరం కాలువలో గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.

అన్న సమారాధన



ద్వారకాతిరుమల: ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషధారణలు

జంగారెడ్డిగూడెం: స్థానిక అశ్వారావుపేట రోడ్డు హైస్కూల్ వద్ద వేంచేసియున్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో అన్న ప్రసాద వితరణను బుధవారం నిర్వహించారు. బుట్టాయిగూడెం రోడ్‌లో ఉన్న చిన్న పిల్లల అనాథ ఆశ్రమానికి అన్న ప్రసాదం పంపించారు. సుమారు 1600 మంది అన్న ప్రసాదం స్వీకరించారని అన్న ప్రసాద వితరణ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కొమ్మసాని రవీందర్ రెడ్డి, చల్లా వరప్రసాద్, శీధరాల శ్రీనివాస వెంకట గంగాధర్, చెన్నూరి శివాజీ కృష్ణ, కల్లూరి మురళీకృష్ణ, రాంప్రసాద్, భక్తాంజనేయ స్వీట్ షాప్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం: అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్న దృశ్యం

ఎండు తెగులు నివారణకు ప్రత్యేక చర్యలు

చింతలపూడి: నియోజకవర్గంలో ప్రస్తుతం వరి పంటలో బ్యాక్టీరియా ఎండు తెగులు ఉధృతి ఎక్కువగా ఉందని, నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏలూరు ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.ఫణికుమార్ తెలిపారు. బుధవారం మండల వ్యవసాయాధికారిణి కె.మీనాకుమారి మండలంలోని వరి పంటలను పరిశీలించారు. వరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏరువాక శాస్త్రవేత్త ఫణికుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు. ఎండు తెగులు సోకిన వరి పంట ఆకులు అంచుల నుంచి లోపలి వైపుకు పసుపు రంగులోకి మారతాయన్నారు. దీని నివారణకు పంట చేల గట్లపై కలుపు మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఎండు ఆకు తెగులు నివారణకు ప్లాంటీ మైసిన్ 2జి, కాపర్ హైడ్రాక్సైడ్ 53.8 డీఎఫ్ కలిపి పిచికారీ చెయ్యాలన్నారు. ఒకవేళ బ్యాక్టీరియా ఉధృతి ఎక్కువగా ఉంటే రెండు వారాల తరువాత రెండో సారి పిచికారీ చేసుకోవాలని చెప్పారు.రైతులకు ఎంవోపీ అందుబాటులో లేకపోతే పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.



ఎండు తెగులు సోకిన వరి చేను

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



బుట్టాయగూడెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో గంగాధరం



కొయ్యలగూడెం: రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



లింగపాలెం: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

బుట్టాయగూడెం: సేంద్రియ ఎరువుల వాడకంతో పాటు మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని జీలుగుమిల్లి ఏవో కె.గంగాధరం అన్నారు. జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం, అంకన్నగూడెంలో రైతుసేవా కేంద్రం వద్ద బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అలాగే అకాల వర్షాల వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలుకువలను కూడా వివరించారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయంపై కూడా రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎంపీ ఎంటీ ధర్మరాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు ప్రశాంత్‌కుమార్, విద్య, ఎస్‌డీఏ నాగేశ్వరరావు, నాగలక్ష్మి, శాంతకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పరింపూడి శివారు రైతుల వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ కె.చెల్లన్నదొర హాజరయ్యారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు ముందుగా ఫీల్డ్ విజిట్ చేశారు. అనంతరం సచివాలయం వద్ద రైతులతో సమావేశమై వారికి ప్రభుత్వ పథకాలను వివరిస్తామన్నారు. వరి పొలంలో ప్రస్తుతం ఎండాకు తెగులు గమనించామన్నారు. దీని నివారణకు ప్లాంటమైసిన్ పిచికారి చేసుకోవాలి సూచించారు. కార్యక్రమంలో రైతులు, వివిధ శాఖల అధికారులు, కోరుకొండ శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం: అయ్యపరాజుగూడెం, ధర్మాజీగూడెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపూడి ఏడీఏ నాగకుమార్, లింగపాలెం మండల ఏవో మురళీకృష్ణ రైతులకు వ్యవసాయ సాగు, మేలైన పద్ధతులు, సస్యరక్షణ గురించి వివరించి పలు సూచనలు సలహాలను అందజేశారు.

అమలుకు నోచుకోని ఆదివాసీ చట్టాలు



సమావేశంలో మాట్లాడుతున్న కుంజా శ్రీను

వేలేరుపాడు: రాజ్యాంగంలో పేరుకు ఆదివాసీల కోసం చట్టాలు ఉన్నాయి. కాని వాటిని అమలు చేసే వాడు లేడని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. బుధవారం వేలేరుపాడులో ఏఎస్‌పీ, ఏటీపీ, ఏపీఎస్‌పీ సమావేశం సోడె సీతారామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కుంజా శ్రీను మాట్లాడుతూ రాజ్యాంగంలో 5వ షెడ్యూల్ మొత్తం నాన్ ట్రైబల్ అధీనంలోకి వెళ్లిపోయిందన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏటీపీ రాష్ట్ర కోశాధికారి వంజం ధర్మ రాజు, ఏఎస్‌పీ మండల ప్రధాన కార్యదర్శి ముత్యాలరావు, పోట్ల మోహన్, పాయం రమేష్, కూరం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం మండల న్యాయ సేవాధికారి సంస్థ జంగారెడ్డిగూడెం కోర్టు ప్రాంగణంలో పని చేసే మహిళా ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను ఏ విధంగా అధిగమించాలి అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్, జూనియర్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ స్వరూప రాణి, కోర్టు సిబ్బంది, లేడీ అడ్వకేట్స్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని అక్కంపేటలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు అందించే పౌష్టికాహారాన్ని తీసుకుంటూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా జీవించాలన్నారు. పిల్లలకు తల్లి ముర్రిపాలు తప్పనిసరిగా పట్టించాలని తెలిపారు. అనంతరం సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సాయిల సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీదేవి, చంద్రకళ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామలింగేశ్వరస్వామి కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: ఆరుద్ర నక్షత్రం కావడంతో బ్రహ్మసూత్రం శైవ క్షేత్రమైన గురవాయిగూడెం శ్రీరాజ శ్యామలాదేవి సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు.

